క్లుప్తంగా

హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌కు సన్మానం



హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న నర్సింగ్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యంను మంగళవారం ఆమె ఛాంబర్‌లో ఏపీ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రాంతీయ శిక్షణా కేంద్రానికి గత ఆరు నెలలుగా సెక్యూరిటీ లేకపోవడం, రహదారి సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలను ఇటీవల అసోసియేషన్ నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమస్యలను పరిష్కరించడంతో పాటు ట్రెనింగ్ సెంటర్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు జి.శాంతిభవాని, ట్రెజరర్ లక్ష్మినరసమ్మ, ఈసీ మెంబర్లు శాంతిలత, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ పరీక్షల తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆధ్వర్యంలో జీఎన్ఎం నర్సింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఐదు కేంద్రాలను మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఒక మెడికల్ ఆఫీసర్‌ను అబ్జర్వర్‌గా నియమించినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: విశ్రాంత ఉద్యోగుల డైరీని మంగళవారం టీజీవీ కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. విశ్రాంత కలెక్టర్ రామ్‌శంకర్ నాయక్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకరప్ప తదితరులు నూతన డైరీలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నా రు. వ్యాయామం, ధ్యానం, యోగ వంటి మా నసిక ప్రశాంతత కలిగించే వాటిని క్రమం తప్పకుండా చేయాలన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గంగాధర్ రెడ్డి, విశ్రాంత జిల్లా రెవెన్యూ అధికారి రఘునాథరెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తిఓబులయ్య, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసికి అమెరికన్ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శివారెడ్డి

కర్నూలు కల్చరల్: మానవతా సంస్థ పూర్వ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన ఎం.శివారెడ్డి సేవలకు గుర్తింపుగా అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ. వారు సోషల్ సర్వీస్ కింద అమెరికన్ యూనివర్సిటీ వారితో కలిసి గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో శివారెడ్డికి అతిథులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టరేట్ అందుకున్న శివారెడ్డికి మానవత సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి, సభ్యులు పాటిల్ హనుమంతరెడ్డి, చింతపల్లి రామకృష్ణ, శోభన్ బాబు, ఐ.ఎం.స్వామి శుభాకాంక్షలు తెలిపారు.

యువ కెరటం.. ఆదర్శం

- జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్‌కు జిల్లా యువతి
- ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న ముల్లా జాస్మిన్ జహాన్
- వికసిత్ భారత్ యువ నాయకుల డైలాగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక
- ఢిల్లీలో దేశ ప్రధాని సమక్షంలో ప్రజెంటేషన్



ముల్లా జాస్మిన్ జహాన్‌కు బహుమతి అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ పి.షేక్ షావలి ఖాన్

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన యువతి ముల్లా జాస్మిన్ జహాన్‌కు జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహించే అరుదైన అవకాశం లభించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న ×నేషనల్ యూత్ ఫెస్టివల్ -2025 ।లో నేషనల్ యంగ్ లీడర్‌షిప్ డైలాగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొననుంది. కర్నూలు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఇంగ్లిష్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాస్మిన్ దేశ రాజధానిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనడం ఉమ్మడి జిల్లాతో పాటు ఉర్దూ విశ్వవిద్యాలయానికి గర్వకారణం.

30 మందిలో ద్వితీయ స్థానంలో నిలిచి

బనగానపల్లెకు చెందిన షేక్ షామ పర్వీన్, ముల్లా చాంద్ బాషా దంపతుల కుమార్తె ముల్లా జాస్మిన్. ఈమె నంద్యాల కేశవరెడ్డి పాఠశాలలో పాఠశాల విద్య, కర్నూలు శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్, బనగానపల్లెలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదివారు. ప్రస్తుతం కర్నూలు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఇంగ్లిష్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గతేడాది వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన యంగ్ లీడర్ షిప్ కార్యక్రమంలో పాల్గొని ఉపన్యసించింది. ఇందులో ఏపీ నుంచి పాల్గొన్న 30 మంది యువతకు రెండు రౌండ్ల పోటీలు నిర్వహించారు. ఇందులో ద్వితీయ స్థానంలో నిలవడంతో పాటు ముగ్గురు ఉన్న బృందంలో విజేతగా నిలిచింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, యువజన క్రీడల శాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ పాల్గొనే కార్యక్రమంలో జాస్మిన్ 'మహిళలకు సాధికారత కల్పించడం, సామాజిక సూచికలను మెరుగుపరచడం' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొననున్న ముల్లా జాస్మిన్‌ను ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.షేక్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, ప్రోగ్రాం ఆఫీసర్లు అభినందించారు. వర్సిటీ విద్యార్థిని జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనడం గర్వకారణమని ఇన్‌చార్జ్ వీసీ పేర్కొన్నారు.

యూత్ ఫెస్టివల్ షెడ్యూల్

– 10వ తేదీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్, 11వ తేదీన వివిధ డిపార్ట్‌మెంట్స్ ఎక్స్‌పర్ట్స్‌తో ఇంటరాక్షన్, 12వ తేదీన ప్రధానమంత్రి, యూనియన్ మినిస్టర్స్‌తో లంచ్, డిన్నర్ మీటింగ్ ఉంటుంది.

అందరి ప్రోత్సాహంతోనే..



కర్నూలు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ తరఫున జాతీయ యువజనోత్సవాలు–2025లో భాగమైనందుకు గర్విస్తున్నాను. కుటుంబ సభ్యులు, యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎస్ షావలిఖాన్, రిజిస్ట్రార్ వి.లోకనాథ్, అధ్యాపకుల ప్రోత్సాహం, సహకారంతో వికసిత్ భారత్ యువ నాయకుల డైలాగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక కాగలిగాను. న్యూఢిల్లీలోని భారత మండపంలో మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. దేశ ప్రధాని, కేంద్ర మంత్రులతో కలిసి లంచ్, డిన్నర్ చేసే అద్భుత అవకాశం లభించినందుకు చాలా సంతోషంగా ఉంది.

– ముల్లా జాస్మిన్ జహాన్

సౌత్‌జోన్ పోటీల్లో ప్రతిభ చాటాలి



ఆర్‌యూ చెస్ జట్టుకు క్రీడాదుస్తులు అందిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు (టౌన్): చెన్నైలోని వెల్‌టెక్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల చెస్ పురుషుల పోటీల్లో ప్రతిభ చాటాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. మంగళవారం వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో.. చెస్ పోటీల్లో పాల్గొనే పురుషుల జట్టుకు వీసీ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ పురుషుల పోటీల్లో సత్తా చాటి వర్సిటీకీ మంచి పేరు తీసుకురావాలని కోరారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.శివకిషోర్ చెస్ పురుషుల జట్టు వివరాలు వెల్లడించారు. జట్టులో రంగస్వామి, రమేష్, సమీర్, వినోద్‌కుమార్, జశ్వంత్, పవన్‌కుమార్ ఉన్నారు.

చంద్రబాబు పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి

- బాబు కంటే జగనే మేలంటున్న మెజార్టీ ప్రజలు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



కర్నూలు (టౌన్): చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? 2027 సంవత్సరంలో జమిలీ ఎన్నికలు రావడం ఖాయం, జగనన్న మళ్లీ సీఎం కావడం తథ్యం అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సి.క్యాంపులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరుతో చేతగాని హామీలన్ని ప్రకటించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. కూటమి మోసంపై ప్రజలు తీవ్ర అంసతృప్తితో ఉన్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో ఆరు నెలల్లో సంక్షేమం పేరుతో రూ.30 వేల కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారని చంద్రబాబు ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకపోగా రూ.70 వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. అమరావతిని ప్రపంచంలోనే గొప్పగా అభివృద్ధి చేస్తామని చెప్పుకుంటూ ఆర్థిక దోపిడీకీ పాల్పడుతోందని ఆరోపించారు. ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేని చంద్రబాబు కన్నా.. చెప్పిన సమయానికి సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వంద రెట్లు మేలని రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసి పోటీచేసినా వైఎస్సార్‌సీపీ కంటే 10 శాతం ఓట్లే అధికంగా సాధించగలిగారని, ఈ ఏడు నెలల కాలంలో అసమర్థ కూటమి పాలన వల్ల వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు నేరవేర్చేంత వరకు ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు.

ఉడిపి మఠాధిపతులను కలిసిన బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): కర్ణాటక రాష్ట్రంలోని పేజావర్ ఉడిపి మఠాధిపతులు శ్రీ విశ్వ ప్రసన్న తీర్థ స్వాములను మంగళవారం నగర బ్రాహ్మణ సంఘం నేతలు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక బీ క్యాంప్‌లోని విజ్ఞాన మందిరానికి వచ్చిన స్వామిని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ నేతలు కలిసి ఆయనను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కర్నూలులోని సంకల్‌భాగ్ శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కరపత్రాలు అందించి ఆహ్వానించారు. నేతలు నాగులవరం రాజశేఖర్, రిటైర్డు పోస్టల్ సూపరింటెండెంట్ సుబ్బారావు, రవిచంద్రశర్మ తదితరులు ఉన్నారు.

నేడు పౌరాణిక నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగస్థల సంగీత విద్వాంసుడు, దర్శకుడు కె.సి. శివారెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకొని కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు ఉచిత పౌరాణిక నాటక సన్నివేశాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్‌బాబు పేర్కొన్నారు. నారద, కర్ణుడు ఏకపాత్రాభినయాలు, శ్రీకృష్ణ పడక సీను, చింతామణి నాటక సన్నివేశాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు



కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): పార్టీ కోసం పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో కోశాధికారిగా కల్లా నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఆయన మంగళవారం స్థానిక గిప్సన్ కాలనీలో ఉన్న ఎస్వీ మోహన్ రెడ్డి నివాసంలో పార్టీ మహిళా నాయకురాలు కల్లా నాగవేణి రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్వీ దంపతులకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో పార్టీ మంచి జోష్‌లో ఉందన్నారు. కర్నూలు నియోజవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కోసం పనిచేసిన వారందరికీ గుర్తింపు ఇచ్చినట్లు చెప్పారు. ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజల తరఫున అధికార పార్టీ ప్రజా వ్యతిరేక పాలనను తిప్పి కొడదామని పిలుపునిచ్చారు. అధికారం చేపట్టి 7 నెలలు గడిచినా సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీని అమలు చేయని చంద్రబాబు ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. కేడీసీసీ మాజీ చైర్‌పర్సన్ విజయమనోహరి, ఎస్వీ జనక్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

శ్రీరాముడి విగ్రహ నిర్మాణానికి పూజ



శ్రీరాముడి విగ్రహ ఏర్పాటుకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

కర్నూలు కల్చరల్: శ్రీరామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగాలని ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వ ప్రసన్న తీర్థులు ఆకాంక్షించారు. ఓల్డ్ సిటీ పేటలో వెలసిన శ్రీ సీతారామచంద్ర స్వాముల శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 20 అడుగుల సుందర శ్రీరాముడి విగ్రహం నిర్మాణానికి పూజా కార్యక్రమం జరిగింది. ఆలయం ప్రధాన అర్చకులు మాళిగి హనుమేశాచార్యులు మాట్లాడుతూ ఏప్రిల్ 12 నుంచి 18వ తేదీ వరకు సప్తరాత్రి శతాబ్ది బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16న సీతారాముల కల్యాణం, రథోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్సవాల స్టిక్కర్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యకర్తలు, వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు మాళిగి వ్యాసరాజ్, సందడి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణకు పోరాటం

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీ పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, రీజనల్ కార్యదర్శి రాముడు పేర్కొన్నారు. సంక్రాంతి తరువాత ఐక్య ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి సర్కారుపై పోరాటాలు చేస్తామన్నారు. హైర్ బస్సుల స్థానంలో ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టాలన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు.

రోగులతో మర్యాదగా నడుచుకోవాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే రోగులతో నర్సులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నర్సులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నర్సింగ్ సేవలు ఎంతో కీలకమన్నారు. పలు విభాగాల్లో ఉండే నర్సింగ్ సిబ్బంది ప్రతిరోజూ ఆయా విభాగాల్లో వైద్యులతో పాటు రౌండ్స్‌లో పాల్గొనాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని రోగులను మర్యాదపూర్వకంగా పలకరించి, వారికి మెరుగైన వైద్యసేవలు అందించడంలో భాగం కావాలని చెప్పారు. నర్సింగ్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంఓ బి. వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి



ఏపీఈఆర్‌సీ కార్యదర్శి కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ వినియెగదారుల నుంచి వసూలు చేస్తున్న అన్ని రకాల చార్జీలను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్ నియంత్రణ మండలి కార్యదర్శి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ట్రూఅప్ చార్జీల పేరిట ఆర్థిక భారం మోపిన కూటమి ప్రభుత్వం మరోసారి వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపడానికి బూటకపు విచారణకు పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అక్రమంగా వినియోగదారుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ప్రజలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఒక యూనిట్ విద్యుత్ రూ.4.50లకు చేసుకున్న ఒప్పందంలో ఎన్ని కోట్లు అవినీతి జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలపై మోపిన చార్జీలన్నీ ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే రద్దు చేయాలన్నారు. లేకపోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

వెయిట్‌లిఫ్టర్ జహీర్ ముమ్మర సాధన



సాధన చేస్తున్న జహీర్ ఖాన్

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ జహీర్ ఖాన్ కర్నూలులో ముమ్మరంగా సాధన చేస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో హర్యానాకు చెందిన వెయిట్ లిఫ్టర్ జహీర్ ఖాన్ జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ నెల 18 నుంచి జలంధర్‌లో నిర్వహించనున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు కర్నూలు స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ హాలులో శిక్షణ తీసుకుంటున్నాడు. తక్కువ సమయం ఉండటంతో పాటు హర్యానాలో పొగ మంచు కారణంగా శిక్షణ తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అతను గత వారం రోజులుగా ప్రతిరోజూ 4 గంటలు వెయిట్ లిఫ్టింగ్ సాధన చేస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్ కోచ్ యూసుఫ్ బాషా నేతృత్వంలో ఈ శిక్షణ కొనసాగుతోంది.

గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు నేరం



లింగ నిర్ధారణ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయిస్తున్న బి.లీలా వెంకటశేషాద్రి, ఎం.వెంకట హరినాథ్ తదితరులు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు నేరమని చెప్పారు. ఏ స్కానింగ్ సెంటర్‌లోనైన లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే శిక్ష తప్పదని, మహిళల హక్కులు, రక్షణ చట్టాల గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ సెంటర్ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098 గురించి వివరించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పి.శాంతికళ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లింగ నిర్ధారణ వ్యతిరేక ప్రతిజ్ఞను జిల్లా ప్రోగ్రాం కన్సల్టెంట్, న్యాయవాది సుమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవికా రాణి, రాయపాటి శ్రీనివాస్, డిప్యూటీ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, పి.హీలాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు పనిచేస్తున్న స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, పారిశుద్ధ్య కార్మికులను, ఉపాధిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేయాలన్నారు.మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం నిరసన దినాన్ని పాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, గతంలో చంద్రబాబు నాయుడు స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తిస్తామని తీర్మానం చేశారని, ఈ ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలన్నారు. నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వేతనాలను పెంచాలన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న కూటమి సర్కార్ స్పందించకపోతే పోరాటాలకు దిగుతామని స్పష్టం చేశారు. నాయకులు ఎస్.మునెప్ప, జి.చంద్రశేఖర్, చాందిని పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన సీపీఐ నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న పి.రామకృష్ణారెడ్డి

కర్నూలు(సెంట్రల్): అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇంటిని నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఐదో రోజు దీక్షలను సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి 2 సెంట్ల స్థలం ఇస్తానని మాట ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత హామీపై మాట్లడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అలాగే కర్నూలు నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణకు కొత్తబస్టాండ్, హాస్పిటల్ సమీపాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. హంద్రీ నీరు ఇళ్లలోకి రాకుండా రక్షణ గోడను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాటల గారడీ మోదీ.. ఏపీకి రావొద్దు

- వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్టని ప్రధానమంత్రి
- విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయొద్దని సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన
- ఏపీకి అన్యాయం చేసిన మోదీకి ఎలా స్వాగతం పలుకుతారని బాబుకు ప్రశ్న



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): మాటల గారడీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. ఆంధ్రప్రదేశ్‌కు రావొద్దని, వస్తే అడ్డుకుంటామని సీపీఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల హెచ్చరించారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్టని మోదీకి ఏపీలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం అయిన విశాఖ ఉక్కు కర్మగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్న మోదీ ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రానికి వస్తారని ప్రశ్నించారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో 'ఏపీకి మోదీ రావొద్దని' కోరుతూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల పేరుతో రాష్ట్రానికి రాబోతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీకి చేసిన అన్యాయంపై ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 11 ఏళ్ల పాలనలో ఏపీ పునర్‌విభజన చట్టం ప్రకారం విశాఖ రైల్వేజోన్, కడప స్టీలు ప్లాంటు, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం కోసం చెంబుడు నీళ్లు, తట్టెడు మట్టి ఇచ్చి చేతులు దులుపుకున్న బీజేపీ నాయకులకు రాష్ట్రంలో పర్యటించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో భాగమైన చంద్రబాబునాయుడు కూడా ఏపీకి జరిగిన అన్యాయంపై ఏ ముఖం పెట్టుకొని మోదీకి స్వాగతం పలుకుతారని, ఆయనతో సభలను పంచుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టి.రాముడు, ఎం.రాజశేఖర్, పీఎస్ రాధాకృష్ణ,జి.రామకృష్ణ, కె.వెంకటేశ్వర్లు, కేవీనారాయణ, ఎండీ ఆనంద్‌బాబు, ఎండీ అంజిబాబు, అలివేలమ్మ, అరుణమ్మ, నగేష్, గురుశేఖర్, పాల్గొన్నారు.